351)గౌళ

ప|| ఇటులైతే బుణ్యము నీకు యిది వుపకారంబౌను | తటుకన నీకీరితి వొగడుదురు తలకొని యిందరును ||

చ|| సురాసురగంధర్వయక్షులు మిమ్ము దెలియగలేరు | పరాశరాదులు మీరూపు భావించగలేరు |
నరు లెరుగుదురా మిమ్ము నారాయణ నీవే సులభుడవై | కరీంద్రు గాచినయటువలె గాతువుగాక ||

చ|| సనాతనబహువేదశాస్త్రంబులు మిము నుతింపలేవు | అనంతయజ్ఞంబులు మిమ్ము నటు సాధించగలేవు |
తనూధరు లెంతటివారు దామోదర నీవే అహల్యను | వినోదముగ గాచినయటువలెవెస గాతువుగాక ||

చ|| రమాపతి నీళామహిరాసులు మీతలపెఱుంగరు | సమేతులైనశేషాదులు మీజాడ మీరలేరు |
తమోమయు లిందరును ధరణీధర శ్రీవేంకటేశ | నమోనమో యని మొక్కగా నను గాతువుగాక ||